జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 10 | జులై | 2025 • పేజీలు : 5

# మొక్కలతోనే మానవాళికి మనుగడ



**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి:** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటితేనే భవిష్యత్తులో మానవాళికి మనుగడ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ఇల్లందు మండలం రొంపేడు పంచాయితీ లో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమాన్ని 1950లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో ఉన్నప్పుడు ఈ కార్యక్రమానికి నాంది పలికి నేటికీ 75 ఏళ్లు పూర్తి

మిగతా 2 లో...





# దాడి ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

- చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా
- దేవస్థానం భూముల్లో కాదు... గ్రామకంఠం భూముల్లో ఉంటున్నాం
- పురుషోత్తపట్నం వాసుల వెల్లడి
- ఆలయ ఈవోను ఫోన్లో పరామర్శించిన మంత్రి తుమ్మల

**భద్రాచలం, జూలై 9 ,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన అధికారులు ఎటపాక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా రావడంతోనే ఘర్షణ వాతావరణం చోటు చేసుకుందని, దాడి ఘటన సమాచారం మాకు లేదని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వివాదం అనేక ఏళ్లుగా నడుస్తోందని, సమస్య పాతదే అయినప్పటికీ ఇటీవల కాలంలో ఎక్కువ సార్లు గొడవలు జరుగుతున్నాయని, మాకు సమాచారం వచ్చిన సమయంలో బందోబస్తు కల్పిస్తున్నామని అన్నారు. అయితే సోమవారం జరిగిన ఈవోపై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మరోసారి దేవస్థానం అధికారులు పురుషోత్తపట్నం భూముల్లోకి వస్తే మాత్రం తగిన సమాచారం ముందుగానే ఇవ్వాలని అన్నారు. ఈ సమస్యపై ఇరురాష్ట్రాల అధికారులు మాట్లాడుకొని పరిష్కారం వెతికే అవకాశం ఉన్నందున ప్రజలు సంయమనం పాటించాలని, దేవస్థానం అధికారులకు పురుషోత్తపట్నం గ్రామస్తులు సహకరించాలని కోరారు.

**దేవస్థానం భూములు కాదు.... గ్రామకంఠం భూముల్లో ఉంటున్నాం : పురుషోత్తపట్నం వాసుల వెల్లడి**

మేమ 80 ఏళ్ల నుంచి పురుషోత్తపట్నం గ్రామంలో ఉంటున్నాం. గ్రామకంఠం కిందకు వచ్చే భూముల్లోనే నివాసం ఉంటున్నామని పురుషోత్తపట్నం

మిగతా 2 లో...



# మెగా ఆధార్ క్యాంపుకు విశేష స్పందన

**మండలాల వారీగా ఆధార్ క్యాంపులు – అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 9, ప్రజాజ్యోతి:** కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మెగా క్యాంపుకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది ,జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించు మెగా ఆధార్ క్యాంపును బుధవారం అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆధార్ వివరాల నవీకరణ, చిన్నపిల్లల బయోమెట్రిక్ నమోదు, చిరునామా మార్పులు, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉండటంతో పెద్ద ఎత్తున ప్రజలు మెగా ఆధార్ క్యాంపుకు విచ్చేసి సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున మెగా ఆధార్ క్యాంపు కు ప్రజలు తరలి వచ్చారని, వారికి అనుగుణంగా కావలసిన ఏర్పాట్లు

మిగతా 2 లో...

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి:** మండలంలోని పూబెల్లి, సుదిమళ్ల పంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో ప్రతి ఇంటిని కలియతిరిగి, స్థానిక సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి మండల రాము, మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు, మాజీ ఎంపిపి లు చీమల నాగరత్నమ్మ, మోకాళ్ళ వెంకటమ్మ, మాజీ సర్పంచులు పాయం స్వాతి, కల్తీ పద్మ, నాయకులు నాయకులు బక్కయ్య, శ్రీకాంత్, దండుగుల శివ, ప్రసన్న కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద 22.7 అడుగుల వద్ద గోదావరి



**భద్రాచలం, జూలై 9,ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి వరదనీటిమట్టం బుధవారం 22.7 అడుగులకు చేరుకుంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరిలోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో క్రమక్రమంగా గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. రాత్రికి మరో రెండు అడుగులు పెరుగుతుందని సీడబ్ల్యూసీ అధికారులు చెబుతున్నారు.

## మొక్కలతోనే మానవాళికి మనుగడ



(మొదటి పేజీ తరువాయి...)
అయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 కోట్ల మొక్కలు పెంచడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఐదు మొక్కలు నేషనల్ వాటిని సంరక్షించాలని సూచించారు. సకాలంలో వర్షాలు పడడానికి చెట్లు దోహదపడతాయని, స్వచ్ఛమైన గాలిని అందిస్తాయని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రబాను, ఫారెస్ట్ ఎఫ్డిఓ కరుణాకర్ చారి, ఫారెస్ట్ రేంజర్లు చలపతిరావు, నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, పిఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, మాజీ యంపిటిసీ పాయం కృష్ణ ప్రసాద్, నాయకులు డి. శివకుమార్, పులి సైదులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- **టిజిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు బాదావత్ బద్రు**

**ములకలపల్లి, జూలై 9, ప్రజా జ్యోతి:** కోర్టు ఆదేశాల మేరకు విధి నిర్వహణలో భాగంగా ఫీల్డ్ ఎంక్వయిరీ కు వెళ్లిన జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదావత్ బద్రు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పాత్రికేయలతో మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఫీల్డ్ ఎంక్వయిరీకి వెళ్లిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పై దాడిని టిజిఆర్ఎస్ఏ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో తగినంత సిబ్బంది లేకపోయినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు అమలు చేయడంతో పాటు విపత్తుల నిర్వహణ ప్రోటోకాల్ భూ పరిపాలన లాంటి కీలక విధులు నిర్వహించే క్షేత్రస్థాయి రెవెన్యూ ఉద్యోగులపై దాడి చేయడం దురదృష్టకరమన్నారు ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించే రెవెన్యూ ఉద్యోగులపై దాడులు జరిగితే ప్రభుత్వ సేవలకు విఘాతం కలుగుతుందని పోలీస్ శాఖ ద్వారా రెవిన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిబద్ధత అంకితభావంతో పనిచేస్తున్న రెవెన్యూ కుటుంబ సభ్యులకు టి జి ఆర్ ఎస్ ఏ రాష్ట్ర కమిటీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.



## పాఠశాలల్లో చికిత్స కిట్లు అందించేందుకు షార్ట్ టెండర్లకు ఆహ్వానం



**భద్రాచలం, జూలై 9, ప్రజాజ్యోతి:** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించడం కొరకు 114 ప్రాథమిక చికిత్స కిట్స్(మెడికల్ కిట్స్) 114 పాఠశాలల్లో అందించుట కొరకు షార్ట్ టెండర్స్ ఆహ్వానించడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి గల టెండర్ దారులు టెండర్ షెడ్యూల్ను అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (గి.సం) ఐటీడీఏ భద్రాచలం నందు రూ 2000/-రుసుము చెల్లించి టెండర్ షెడ్యూల్ కాపీ పొందగలరని, పూర్తి చేసిన టెండర్ షెడ్యూల్ను ఈ నెల 10వ తేదీ నుండి 15వ తేదీ వరకు (పని దినాలలో) ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అందజేయాలని, ఇతర వివరముల కొరకు కార్యాలయం 8978881206 ద్వారా సంప్రదించి తెలుసుకోవాలని ఆయన కోరారు.

# దాడి ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి...)
గ్రామ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు పేర్కొన్నారు. దేవస్థానం ఈవో రమాదేవి ఇవి దేవస్థానం భూములంటూ గ్రామస్తులపై ఏకపక్షంగా దాడులు చేస్తూ పదే పదే గ్రామ ప్రజలను ఇబ్బందులు పెడుతోందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉంటే పోలీసు, రెవిన్యూ అధికారులను కలిసి వివరించి మాతో మాట్లాలి కాని, ప్రయివేటు సైన్యంను వేసుకొని మా గ్రామం మీదకు వస్తోందని తరచూ ఇలాగే చేయడం సహేతుకమైన చర్య కాదన్నారు. ఈవోపై మేము దాడి చేయలేదు, ముట్టుకోలేదు. మాకు ప్రభుత్వ అధికారులంటే ఎంతో గౌరవమని, ఏదైనా ఉంటే చట్టపరంగానే చూసుకుంటామని అన్నారు.

**ఈవోతో ఫోన్లో మాట్లాడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల...**

భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవితో బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. గ్రామస్తులు దాడి చేయడం దురదృష్టకరమన్నారు. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టరును ఆదేశించారు. ఆలయ భూముల విషయంలో ఇరు రాష్ట్రాలు చర్చించి దేవాలయానికి చెందేలా చర్యలు తీసుకుంటామని ఆ భూములు దక్కితేనే ఆలయ అభివృద్ధి సాధ్యమన్నారు.

## మెగా ఆధార్ క్యాంపుకు విశేష స్పందన

(మొదటి పేజీ తరువాయి...)
చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి బృంద సభ్యులు ఆదార్ సమస్యలపై తగిన పరిష్కారాలు చూపించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి సౌకర్యార్థం ప్రతి మండల కేంద్రంలో ఆధార్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు ఆధార్ నవీకరణ , సవరణకు వస్తున్నందున ప్రతి మండలంలో షెడ్యూల్ వారిగా ఆధార్ క్యాంపులు ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని 23 మండలాల్లో వేర్వేరు తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**జూలై 10, 11 తేదీలలో :** కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జులూరుపాడు, చంద్రుగొండ మండలాలకు కలెక్టర్ కార్యాలయంలోని నవభారత్ హాలులో ఆధార్ సేవలు అందించనున్నారు.

**జూలై 14, 15, 16 తేదీలలో :** భద్రాచలం, బుర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో, ఇల్లందు, టెకులపల్లి, అల్లాపల్లి, గుండాల మండలాలకు యెల్లందు మున్సిపల్ కార్యాలయంలో క్యాంపులు జరుగుతాయి.

**జూలై 15, 16, 17 తేదీలలో :** దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మరియు ఆస్వారాపేట మండలాలకు, మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో మణుగూరు, ఆస్వాపురం, పినపాక మరియు కారకగూడెం మండలాలకు క్యాంపులు నిర్వహించనున్నారు.



ప్రతి కేంద్రంలో అవసరానికి తగిన విధంగా ఆధార్ కిట్లు అందుబాటులో ఉంచి వేగవంతంగా సేవలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రజలు ఆధార్ సమస్యలను పరిష్కరించుకునే వరకు నిరంతరంగా ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ యు ఐ డి ఐ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సౌభన్, జిల్లా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వర రావు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ బిఎడ్ కోర్స్ కు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం, జూలై 9 ప్రజాజ్యోతి:** రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమం కొరకు భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో 2025-27 విద్యా సంవత్సరం నకుగాను (27 బ్యాచ్) 02. సంవత్సరముల రెగ్యులర్ బి.ఎడ్, కోర్సులో ప్రవేశం నిమిత్తం ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుండి నేరుగా దరఖాస్తులను కోరుచున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో ప్రవేశం కొరకు తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతములకు చెందిన గిరిజన పట్టాభద్రులై ఉండాలని, డిగ్రీ పాసై కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలని, సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్ ను బట్టి ఎంపిక చేయడం జరుగుతుందని, ప్రభుత్వ నియమాల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరి వారికి సీట్లు రిజర్వు చేయబడ్డాయని, ప్రభుత్వ ఉత్తర్వుల నెంబరు 14. తేదీ 12/4/2021, తేదీ 19/5/2009 ప్రకారం పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కళాశాలలో 100 సీట్లు కలవని, ప్రాస్పెక్టేస్ మరియు దరఖాస్తులు ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరు, ఐటీడీఏ కార్యాలయంలలోను మరియు గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలం నందు ప్రాస్పెక్టేస్ మరియు దరఖాస్తులు పొందవచ్చునని ఆయన అన్నారు. దరఖాస్తులు పోస్టు ద్వారా పొందగోరు అభ్యర్థులు తమ సొంత అడ్రస్ గల కవర్ (రు.10/-స్టాంపుతో) ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల భద్రాచలం కు పంపి పొందవచ్చునని, దరఖాస్తు మరియు ప్రాస్పెక్టస్ క్షుణ్ణంగా చదివి దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని, అసంపూర్తి దరఖాస్తులు తిరస్కరించబడునని, దరఖాస్తు నమూనా ప్రకారం పూర్తిచేసి తగు ప్రతులు జతచేసిన దరఖాస్తులు బీఈడీ కళాశాల భద్రాచలంకు 08 ఆగస్టు 2025 వరకు అందజేయాలని, మరిన్ని వివరాల కొరకు 8978477345 నెంబర్ కు సంప్రదించి తెలుసుకోగలరని, కళాశాల ప్రిన్సిపాల్ వీరు నాయక్ తెలిపారు.



## కార్మిక హక్కులను కాల రాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- **హక్కులను కాపాడుకోవడం ప్రతీ కార్మికుడి బాధ్యత**
- **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.రేసు ఎల్లయ్య**

**ఆళ్ళపల్లి జులై 9.ప్రజా జ్యోతి** ప్రభుత్వ పరిశ్రమలను ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటర్లకు కట్టబెట్టి కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం పై పోరాడి కార్మిక హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులదె అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులురేసు ఎల్లయ్య అన్నారు. బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పెట్టబడుదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మండల ప్రాంగణంలోని హనుమాన్ విగ్రహం వద్ద నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు కొమరం హనుమంతరావు, ఏఐటియుసి మండల అధ్యక్షులు పూనెం సుజాత, ప్రధాన కార్యదర్శి కుంట సహదేవ్, ఆవాజ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎండీ జలాల్, సిఐటియు నాయకులు, వజ్జ సుశీల, సీత సడియం సుగుణ, పాల్గొన్న సంఘాలు అంగన్వాడి వర్కర్స్ యూనియన్, ఆశ వర్కర్స్ యూనియన్, మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ తదితరులు పాల్గొన్నారు.



# అమరుల స్మారక స్థూపాల ఆవిష్కరణ సభను జయప్రదం చేయండి

**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి:** ఈనెల 16న ఇల్లందులో జరుగు రాయల చంద్రశేఖర్, ఎల్లన్న, గండి యదన్నల స్మారక స్థూపాల ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు చంద్ర అరుణలు కోరారు. బుధవారం చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇల్లందు ఏజెన్సీ ప్రాంత ప్రజల కోసం, వారి హక్కుల కోసం, కూడు, గూడు, నీడ, భూమి కావాలని విప్లవ మార్గంలో ప్రయాణించే క్రమంలో పోలీసు నిర్బంధాలు, జైలు జీవితం, రౌడీ మూకల దాడులు ఎదుర్కొంటూ కష్టాలు, కన్నీళ్లు, కడగండ్లను భరించి ప్రజా అభివృద్ధి కోసం ఆనాడు సాయుధ మార్గాన్ని ఎంచుకొని పీడిత ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు.




నోరు లేని ఆదివాసీలు, దళితులు ఇతర పేద వర్గాలు దోపిడికి గురవుతుంటే వారికి ప్రశ్నించడం నేర్పించారని పేర్కొన్నారు. భూమిలేని పేదలకు భూమి పంచారని, కూలి, తునికాకు రేట్లు, అధిక ధరల నియంత్రణ కోసం పోరాడారని తెలిపారు. వడ్డీ వ్యాపారస్తుల నడ్డి విరిచారని, ఊళ్ళల్లో బడులను పెట్టించారని, దోపిడీ దౌర్జన్యాలను ఎదిరించి పోరాడారని, ఆ క్రమంలోనే జీర్ణించుకోలేని ఆనాటి ప్రభుత్వం ఎల్లన్నను ఎన్కౌంటర్ పేరుతో హత్య చేశారని ఆరోపించారు. ఎల్లన్న ఆశలను కొనసాగిస్తామని రాయల చంద్రశేఖర్, గండి యాదన్నలతోపాటు అనేకమంది విప్లవోధ్యమంలో పనిచేసి అమరులయ్యారని పేర్కొన్నారు. ఆ అమరుల ఆశయాల వెలుగులో నేటితరం ప్రయాణించి నేటి పాలకులు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరుల సాక్షిగా ఏజెన్సీ ప్రజలకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు దక్కాలని ఏకం కావలసిన అవసరం ఉందని, అందుకు సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ ముందు అడుగు వేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు నాయిని రాజు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి శంకర్, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు బుర్ర వెంకన్న, ఆర్. బోస్, వాంకుడోత్ అజయ్, పిడియస్ యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా ఇల్లందు పట్టణ కార్యదర్శి పాయం వెంకన్న, టియుసిఐ ఏరియా కమిటీ కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, నాయకులు గురునాథం, రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడే గురుపౌర్ణమికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలి



**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి** :ఇల్లందు పట్టణంలోని లలిత్ కళ మందిర్ రోడ్డులో గల శ్రీను సాయి బాబా ఆలయంలో ఆషాడ మాస పౌర్ణమి (గురుపౌర్ణమి)ని పురస్కరించుకొని నేడు జరిగే విశేష అభిషేక, అర్చనలు, రథం ఊరేగింపులకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై హారతి, తీర్ధ ప్రసాదాలు స్వీకరించి శ్రీ సాయినాధుని కృపా, కటాక్షాలకు పాత్రులు కావాలని శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరపు మల్లికార్జున రావు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గురుపౌర్ణమి కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య –లక్ష్మీ దంపతులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు కాకడ హారతి, 7 గంటలకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, 1 గంటకు మహా అన్నదానం, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, 6:30 గంటలకు రథం ఊరేగింపు, రాత్రి 9:30 గంటలకు శేజ్ హారతి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి సంబురాలు



**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో భాగంగా బుధవారం ఇల్లందు మండలంలోని 29 గ్రామపంచాయతీలలో 86 గ్రామ సంఘాల పరిధిలో మహిళశక్తి సంబురాలను గ్రామ సమైక్యలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సమ్మక్క, ఏపియం దుర్గారావులు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో సాధించిన ప్రగతి, 2025 సంవత్సరంలో సాధించవలసిన లక్ష్యాలు నిర్దేశించటం జరిగిందని, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంఘాలలో లేని వారిని గుర్తించి మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, కిశోర బాలికలను కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయాలని, సభ్యులందరికీ ప్రమాద బీమా లోన్ బీమా, పియంజెజెబివై, పియంఎస్బివై పథకాలలో నమోదు చేయించాలని పేర్కొన్నారు. సంఘాలలో నాయకత్వ మార్పిడి శిక్షణలు, అర్హత గల సంఘాలకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు ఇప్పించడం, అట్టి రుణాలకు వడ్డీ లేని రుణాలు వచ్చే విధంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సూక్ష్మ వ్యాపార సంస్థలు, పాడి పశువుల యూనిట్లు, పౌల్ట్రీ కోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్స్, పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు, సంచార వాహనాల చాపల విక్రయ కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, బడి పిల్లల యూనిఫామ్ కుట్టు కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళా సంఘాలకు ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్, పెట్రోల్ బంకులు స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాధులు పెంపొందించడం, మహిళలను సామాజికంగా ఆర్థికంగా స్వసక్తిగా ఎదిగే విధంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిదంగా సుభాష్ నగర్ అను గ్రామ సంఘం పరిధిలో వినాయక సంఘ సభ్యురాలు నిరుపేద అయినా చీకటి రమ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాళ్లకు గాయాలు, ఆపరేషన్ కావడంతో కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రూ. 13116 లను ఆర్థిక సాయం చేశారు. అనంతరం కొంపల్లి బాలు, బొమ్మెర ముత్యం కళాబృందాలు గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సంపత్, నాగేంద్ర, భూలక్ష్మి , నరసింహారావు, స్వర్ణలత, లాలయ్య, రామ్మూర్తి, కొమ్మలు, గ్రామ సంఘాల ప్రతినిధులు, వివోఓలు పాల్గొన్నారు.



# రజబలి నగర్ లో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు



**అన్నపురెడ్డిపల్లి, జులై 9, ప్రజాజ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శాంతినగర్ శివారు అటవీ ప్రాంతమైన రజబలి నగర్‌లో నివసించే ఛత్తీస్‌గఢ్ ఆదివాసీల కాలనీలో ఈరోజు మలేరియా నివారణ చర్యల భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రియాంక పర్యవేక్షణలో, జిల్లా సహాయ మలేరియా అధికారి కుమార స్వామి నేతృత్వంలో ఆరోగ్య బృందం పాల్గొంది. ఈ సందర్భంగా మొత్తం 22 ఇళ్లలో దోమల నివారణ కోసం ఇండ్లలో ఔషధ మణికట్టు చంపే పిచికారీ (ఇండోర్ రెసిడ్యూల్ స్ప్రే) నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో జ్వరలతో బాధపడుతున్న వారిని పరిశీలించి, రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా ర్యాపిడ్ పరీక్షల ద్వారా ఫలితాలు తెలుసుకుని, అవసరమైన మందులు పంపిణీ చేసి తక్షణమే చికిత్స ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ప్రకాశరావు, ఆరోగ్య సహాయకులు కోటేశ్వరరావు, రామదాసు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమికి ముస్తాబవుతున్న సాయి మందిరం




**భద్రాచలం టౌన్, జులై 9(ప్రజాజ్యోతి):** భద్రాచలం పట్టణం లోని జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా మందిరం లో గురువారం నాడు గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సాయి బాబా మందిరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ తెలిపారు. భక్తుల సహకారంతో నూతనముగా 10 లక్షల రూపాయల వ్యయంతో ఆలయం ముందు షెడ్ నిర్మాణం జరిగిందని, అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం ఆలయం పక్కన ఆడవారికి మగవారికి వేరే వేరే భోజనం జరిగేటట్లు ఏర్పాట్లు తీసుకుంటున్నామని 4,000 మందికి భోజనం అలాగే సుమారు 7000 మంది భక్తులకు ఉచిత బూంది ప్రసాదం, అదేవిధంగా వచ్చే భక్తులు అందరికీ క్యూ సిస్టంలో దర్శనం అయ్యే విధంగా మరియు బాబా వారి ఆలయం పూలతో అలంకరణ పలు కార్యక్రమాలు చేస్తున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురు పౌర్ణమి నాడు శ్రీ సాయి బాబా వారి దర్శించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు న్యాయవాదుల సంఘీభావం



**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి :** కార్మిక హక్కుల పరిష్కారం కోసం, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర వైఖరిని ఖండిస్తూ కార్మిక సంఘాల సమ్మెకు సంఘీభావంగా బుధవారం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు ఎంతో కష్టపడి సాధించుకున్న కార్మిక చట్టాలను విభజన చేసి కార్మికుల హక్కులను హరించడమే అని, కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా విభజించిన కార్మిక చట్టాలను వెంటనే రద్దుచేసి యధాస్థితికి తీసుకురావాలని కోరారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ముందు చూపులేని చర్యలు చేపట్టినట్టయితే రైతు, కార్మిక సంఘాలన్నీ కలుపుకోని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, రైతాంగం, కార్మిక సంఘాలకు ఎల్లప్పుడూ బార్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు ఎన్. మల్లికార్జునరావు, పీ. కరుణాకర్, పి. గోపీనాథ్, దంతాల ఆనంద్, కొండ నారాయణ, మామిడి సత్య ప్రకాష్, బి. రవికుమార్ నాయక్, టీ. మహేశ్వరరావు, పి. అనిల్ కుమార్, ఎస్. బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో సమ్మె సక్సెస్

- కేంద్రం తీసుకొచ్చిన చట్టాలను రద్దు చేయాలి

**ఇల్లందు, జులై 9, ప్రజాజ్యోతి :** కార్మిక హక్కుల పరిష్కారం కోసం, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర వైఖరిని ఖండిస్తూ బుధవారం చేపట్టిన కార్మిక సంఘాల సమ్మె సక్సెస్ అయ్యింది. కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు చట్టాలను రద్దు చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, కార్మిక సంఘాల నాయకులు కె. సారయ్య, దేవరకొండ శంకర్, జె. వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, ఎస్ఏ నబి, మల్లెల వెంకటేశ్వర్లు, జాఫర్ హుస్సేన్, రాసుద్దిన్ లు డిమాండ్ చేశారు. కార్మికులు ఎన్నో ఆందోళన నిర్వహించి సాధించుకున్న హక్కులను కాలరాయడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసే వరకు ఆందోళనలను విరమించబోమని హెచ్చరించారు. కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల మహా ధర్నాను జయప్రదం చేయండి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, జులై 9, ప్రజాజ్యోతి :** ఈనెల 12న హైదరాబాద్ఇందిరాపార్కు వేదికగా జరగబోయే తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘరాష్ట్ర జెఏసీ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య కోరారు. బుధవారం ఐడిఓసిలో. పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, సొసైటీలలో విధులను నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తుందని పేర్కొన్నారు. గత మూడు నెలల నుండి ఆర్థిక శాఖ నుండి అనుమతులు లేకుండా ఉద్యోగస్తులకు జీతాలు పెండింగ్ పెట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల ఇంటి ఖర్చులు కట్టలేక ఉద్యోగస్తులు అప్పులు చేసి బతుకుతున్నారని, మరల ఏజెన్సీలను తీసుకొస్తే సహించేలేదని హెచ్చరించారు. వెంటనే తొలగించిన అవుట్సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని, ఏజెన్సీ విధానం రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కిరణ్, జిల్లా అధ్యక్షుడు దిలీప్, జనరల్ సెక్రెటరీ అన్వేష్, నాయకులు శ్రీనివాస్, సువర్ణ రాజు, పద్మ, నిర్మల్, దిలీప్, సత్యనారాయణ, కార్తీక్, కృష్ణ, అన్వర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**బూర్గంపహాడ్,జూలై9 (ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం కార్మికులను నష్టపరిచే విధంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలో సిఐటియు, ఏఐటియూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడి,ఆశా,మధ్యాహ్న భోజన, గ్రామపంచాయతీ కార్మికులకు నష్టం జరిగే విధంగా ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.బూర్గంపహాడ్ మండల కేంద్రంలో భారీ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బయ్యా రాము, ఐద్వా మండల అధ్యక్షురాలు పి సరోజని, రైతు సంఘ అధ్యక్షులు కె నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అబీదా, కెవిపిఎస్ మండల కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, ఐటిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పూర్ణ, ఐటిసి కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ పాషా,అద్యక్షులు వెంకటరెడ్డి,గోపాలరావు,సిపిఐ ఎల్ మాస్లైన్ మండల కార్యదర్శి బి. మల్సూరు, రాం బిక్షం, సిపిఐ మండల కార్యదర్శి సేప్కం నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాసరావు, మువ్వా వెంకటేశ్వర్లు, ఏఐటియుసి అద్యక్షులు సింగంనేని ప్రసాద్, సుబ్బారెడ్డి, సీతారామిరెడ్డి, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

### ఐటిసి పిఎస్పీడీ యూనియన్లు నిరసన

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐటిసి పిఎస్పిడి సారపాకలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ రషీద్ కు 20 డిమాండ్లతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిసి పిఎస్పిడి ఐఎన్టియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనే రామారావు, యారం పిచ్చిరెడ్డి,టిఎన్టియుసి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కనకమేడల హరిప్రసాద్,గాదె రామ కోటిరెడ్డి, బిఆర్టియు అధ్యక్షులు సానికొమ్మ శంకర్ రెడ్డి,సిఐటియు వెంకటేశ్వర్లు, ప్రవీణ్,ఏఐటీయూసీ సాజిద్,సింగమనేని ప్రసాద్, వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# లేబర్ కోడుల రద్దుకై కదం తొక్కిన కార్మిక లోకం

- పట్టణంలో భారీ ప్రదర్శన ఆర్డీవో కార్యాలయం ముందు మహాధర్న
- లేబర్ కోడ్ ల అమలును అడ్డుకుంటాం
- సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి




**భద్రాచలం టౌన్, జులై 9 (ప్రజాజ్యోతి):** కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని కార్మిక సంఘాలు ఇచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మె భద్రాచలం పట్టణంలో విజయవంతమైంది. లేబర్ కోడుల రద్దు కోసం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కదం తొక్కారు. వందలాది మంది కార్మికులు భద్రాచలం పట్టణ పురవీధుల్లో మహా ప్రదర్శన నిర్వహించి అనంతరం ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మొదట అంబేద్కర్ సెంటర్ లో సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించగా సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మచారి మాట్లాడుతూ లేబర్ కోడులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమరశీల కార్మిక పోరాటాల ద్వారా లేబర్ కోడులను అమలుకాకుండా అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.లేబర్ కోడ్ లు అమలు జరిగితే ఆధునిక సమాజంలో కార్మికులు బానిసలుగా మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది కార్మిక నాయకుల త్యాగాలు,కమ్యూనిస్టు ,వామపక్ష పార్టీలు చట్టసభల్లో ,బయటచేసినపోరాటం , స్వాతంత్ర ఉద్యమ త్యాగాల ఫలితంగానే ఈ చట్టాలు వచ్చాయన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసిన మోడీ ప్రభుత్వానికి అదే పోరాటాల ద్వారా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, వేతనాలు పెంచుకునే హక్కు, చేసిన పనికి వేతనం పొందే హక్కు ఇలా అన్ని రకాల హక్కులను లేబర్ కోడుల ద్వారా కేంద్ర బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందని ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి పేర్కొన్నారు. సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులను కేంద్ర బిజెపి ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కార్మికులు సృష్టిస్తున్న సంపదను .మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం కోసమే లేబర్ కోడ్ తెచ్చిందని విమర్శించారు. కార్మిక హక్కుల్ని అరించి కార్మికులను బలిపీఠం ఎక్కించే ఈ లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.బి నర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పెంచిన పని గంటల జీవో 282 ను రద్దు చేయాలనిడిమాండ్ చేశారు. బిజెపి తెచ్చిన లేబర్ కోడెలను రాష్ట్రంలో అమలు చేయాలని ప్రయత్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతుల పంటలు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని ,ఉపాధి హామీకి నిధులు పెంచాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26,000 అమలు చేయాలని సార్వత్రిక సమ్మె డిమాండ్లు అన్నింటిని కేంద్ర ప్రభుత్వం బేషారత్తుగా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భద్రాచలం పట్టణ పురవీధుల్లో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులు కదం తొక్కారు. ఆర్డీవో కార్యాలయం ధర్నా అనంతరం సమ్మె డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని భద్రాచలం ఆర్డీవో కి అందజేశారు.

### కార్మిక పోరుకు అండగా ఉంటాం

### వామపక్ష ,ప్రతిపక్ష పార్టీల మద్దతు

లేబర్ కోడ్ ల రద్దు కోసం రైతులు ,కార్మికుల హక్కుల కోసం, కార్మిక సంఘాల నేతృత్వంలో జరుగుతున్న పోరాటానికి సిపియం,సిపిఐ,మాస్ లైన్ రాజకీయ పార్టీలు ,ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది .సమ్మె సందర్భంగా జరిగిన సభలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ,సిపిఐ పట్టణ నాయకులు మా రెడ్డి శివాజీ, మాస్ లైన్ పట్టణ నాయకులు మునిగల శివ ,టిఆర్ఎస్ నాయకులు తుమ్మలపల్లి ధనేశ్వరరావు మాట్లాడారు. ఎర్రజెండాల పోరాటాల వల్లనే కార్మికులకు చట్టాలు వచ్చాయని మోడీ ప్రభుత్వం ఆ చట్టాలను రద్దుచేసి కార్మిక వర్గానికి ,దేశ ప్రజానీకానికి తీరని ద్రోహం చేస్తుందని నాయకులు మండిపడ్డారు. దేశంలోని నిజమైన సమస్యలను పక్కనపెట్టి తన మతోన్మాద యజెండాను అమలు చేయడం ద్వారా ప్రజల హక్కుల పైన కార్మిక వర్గ హక్కుల పైన దాడి చేస్తుందనిఅన్నారు. ఈ దాడిని దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మె కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ నాయకులు ఎర్రంశెట్టి వెంకట రామారావు ,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ,డి సీతాలక్ష్మి ,గిరిజన సంఘం జిల్లా నాయకురాలు సున్నం గంగ ,,సి ఐ టి యు అనుబంధ రంగాల నాయకులు కొలగాని రమేష్ ఎస్కె జాకీర్ ,చంద్రలీల, సావిత్రి ,అప్పారి రాము, వేణు , అనుగోజు మధుసూదనా చారి, గుమ్మడి నాగరాజు, చంటి, రాజబాబు నరసమ్మ, రమణ ,సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు అజయ్ కుమార్ ,పెన్షనర్స్ యూనియన్ నాయకులు బంధు వెంకటేశ్వరరావు, సిఐటియు పట్టణ నాయకులు పి సంతోష్,, భూపేందర్ గిరిజన సంఘం నాయకులు కుంజా శ్రీనివాస్, సిఐటియు నాయకులు కాపుల రవి శివమ్మ ఐద్వా సీనియర్ నాయకులు ఎన్ లీలావతి ప్రజానాట్యమండలి నాయకురాలు గౌతమి సిఐటియు నాయకులు చుక్కా మాధవరావు లక్ష్మణ్ రామకృష్ణ ధనకొండ రాఘవయ్య టీఎన్జీవో మాజీ నాయకులు చల్లగుల్ల నాగేశ్వరరావు సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కనక శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా మాతృమూర్తికి బీఆర్ఎస్ నేతల నివాళులు



**బూర్గంపహాడ్, జూలై 9 (ప్రజా జ్యోతి):** కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాతృమూర్తి రేగా నర్సమ్మ బుధవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులతో పాటు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణలు రేగా నివాసానికి చేరుకుని నర్సమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రేగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీను, మండల నాయకులు బెజ్జంకి కనకాచారి, ఎల్లంకి లలిత, తిరుపతి ఏసోబు, తుపాకుల రవికుమార్, యూత్ నాయకులు చల్లకోటి పూర్ణ, సోము లక్ష్మిచైతన్యరెడ్డి, కృష్ణ, కర్రి నాగేశ్వరరావు వేర్వేరుగా వెళ్లి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , జూలై 9,ప్రజాజ్యోతి :** భద్రాచలం పుణ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు బుధవారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు జరిపారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాచలం దేవస్థాన కార్యనిర్వహణాధికారిపై దాడిని వ్యతిరేకిస్తూ పెద్దమ్మగుడి ధర్మకర్తల మండలి, కార్యనిర్వాహణాధికారి అర్చకులు సిబ్బంది తరపున నిరసన



**పాల్వంచ(రూరల్), జూలై 09, ప్రజా జ్యోతి:** భద్రాచలం దేవాలయ భూములలో ఆక్రమణదారులను తొలగించు ప్రక్రియలో దేవాలయ కార్య నిర్వహణ అధికారి యల్.రమాదేవి పై భూ ఆక్రమణదారుల భౌతిక దాడి సంఘటనపై పాల్వంచ మండలం, కేశవాపురం-జగన్నాధపురం గ్రామంలో కల శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి) ధర్మకర్తల మండలి,కార్యనిర్వాహణాధికారి అర్చకులు సిబ్బంది తరపున నిరసన తెలియచేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి దేవాలయమునకు సంబంధించిన భూములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం, పురుషోత్తపట్నం గ్రామంలో కల వాటిలో భూములలో ఆక్రమణదారులు నిర్మాణములు చేయుచున్న విషయమును తెలుసుకొని నిలుపుదల చేయుటకు,తొలగింప చేయుటకు సదరు దేవాలయ కార్యనిర్వహణాధికారైన ఎల్ రమాదేవి వారి సిబ్బందితో సహా ఫీల్డ్ మీదికి వెళ్ళగా అక్కడ గుమ్మిగూడిన గ్రామస్తులు వాగ్వివాదమునకు దిగి వచ్చిన దేవాలయ సిబ్బంది, కార్యనిర్వాహణాధికారిపై భౌతిక దాడి చేయడం జరిగింది.నేడు కొంతమంది ఆక్రమణ దారులు, అరాచకవాదులను ఆసరాగా చేసుకుని భద్రాచలం రామాలయ కార్య నిర్వహణ అధికారి రమాదేవి పై చేసిన భౌతిక దాడి హేయమైన చర్యని,అటవీక చర్యలు అని ఎవరైతే ఈ దాడికి పాల్పడినారో వారిని తక్షణమే కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై ఉన్నదని, ఆ విధంగా బాధ్యులైన వారిని శిక్షించే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొని రావాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వం పై ఉన్నదని, అదేవిధంగా ఉద్యోగస్తుల్ని తమ విధులు నిర్వహిస్తున్న క్రమంలో, రామాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడే క్రమంలో అధికారులపై ఉద్యోగులపై అనేకమార్లు ఇటువంటి దాడులు జరగటం చాలా బాధాకరం. ఉద్యోగస్తుల్ని వారి విధులకు ఆటంకం కలిగించే ఏ ఒక్కరినీ ఉపేక్షించకుండా వారిపై తక్షణం ప్రభుత్వం చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు బాలినేని నాగేశ్వరరావు,ధర్మకర్తల మండలి సభ్యులు చీకటి కార్తీక్, అడుసుమిల్లి సాయిబాబా,పెండ్లి రామిరెడ్డి, చెపుగాని పాపారావు, చెరుకూరి శేఖర్ బాబు, ధర్మరాజుల నాగేశ్వరరావు, శనిగారపు శ్రీనివాసరావు, దుగ్గిరాల సుధాకర్, అర్చకులు, సిబ్బంది తీవ్రంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు.

## ఈవో పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- పానిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి



**పాల్వంచ. (టౌన్), జులై. 9(ప్రజాజ్యోతి):** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం భూములను కాపాడే ప్రయత్నంలో భాగంగా అల్లూరి జిల్లా పురుషోత్తంపట్నంలో ఉన్న 890 ఎకరాల దేవాలయ భూములపై జరుగుతున్న ఆక్రమణలను ఆపేందుకు వెళ్లిన భద్రాచలం ఈవో శ్రీమతి రమాదేవి పై దాడి జరగడం తీవ్రంగా ఖండిస్తున్నాం మహిళా అధికారిపై దాడికి పాల్పడటం సిగ్గుచేటు. దేవాలయ భూములను ఆక్రమించిన వారు, ప్రభుత్వ అధికారులపై ఇలా దాడికి తెగబడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ దాడికి బాధ్యులైన వారిపై వెంటనే హత్యా యత్నం కేసు నమోదు చేయాలి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య పాలన వల్లే ఈరోజు భద్రాచలం దేవస్థానానికి చెందిన భూములు ఆ రోజుల్లో ఆక్రమణలకు గురయ్యాయని , తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులు ఈ భూములను రికవరీ చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొంది.ఈవో గారు గతంలోనూ ఈ భూముల రక్షణ కోసం అనేకసార్లు పురుషోత్తంపట్నం వెళ్లిన సందర్భాలలో కూడ దాడి ప్రయత్నాలు జరిగాయి. అయిన ప్రభుత్వం స్పందించకపోవడం ఈ నిర్లక్ష్యానికి నిదర్శనం.ఇప్పడికైనా వెంటనే తెలంగాణ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించి భద్రాచలం దేవస్థాన భూములకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలి.ఇకనైనా తెలుగు రాష్ట్రాల్లో హిందూ దేవాలయ భూములకు సరైన రక్షణ కల్పించాలి. కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయకుండా, దేవాలయాల భూములు కాపాడే బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తిస్తే బాగుంటుంది. ప్రజలు ఆగ్రహించక ముందే ప్రభుత్వ లు ఈ సమస్య పరిష్కరించాలని లేనియాడల హిందూ దేవాలయ భూముల రక్షణకు హిందూవుల పోరాటం తప్పదని ఈ పోరాటంకు బీజేపీ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. హిందూస్తాన్లో హిందూ దేవాలయ భూములకు రక్షణ కరువవ్వడం బాధాకరం. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని కోరుతున్నాము.ఈ కార్యక్రమం లో బీజేపీ పాల్వంచ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి మాదారపు లక్ష్మణ్,గిరిజన మోర్చ జిల్లా కార్యదర్శి మాలోత్ ప్రశాంత్ నాయక్,గుండు రాజు,గౌనె వెంకన్న,దయాకర్ రెడ్డి,వరక సత్యం, సంకినేని రుద్ర,దామెర్ల సంజయ్ లు పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్వీ వేణుగోపాలచారి





**టేకులపల్లి,జూలై 09, ప్రజాజ్యోతి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారమే ప్రధాన లక్ష్యమని సీజీఆర్ఎఫ్ (టీజీఎన్పీడీసీఎల్ వరంగల్) చైర్మన్ ఎన్వీ వేణుగోపాలచారి అన్నారు. బుధవారం టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. గుర్తించిన సమస్యలను పరిష్కారిస్తామని, వినియోగదారులకు ఎలాంటి సమస్య ఉన్నా వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చాని సూచించారు. టేకులపల్లి మండలంలోని బొమ్మనపల్లి సబ్ స్టేషన్ పరిధిలో పలు సమస్యలపై రైతులు వినతులు అందజేశారు.దీనిపై సీజీఆర్ఎఫ్ స్పందించి అధికారులు సత్వర పరిష్కారించాలని ఆదేశించారు.భద్రాది కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని మాదారం పంచాయతీలోని వేముల కృష్ణమూర్తి ఎప్రిల్ 2024లో విద్యుత్ షాక్తో తన గేదా, దూడ మృతి చెందాగ 80 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ (టీజీఎన్పీడీసీఎల్ వరంగల్) మెంబర్ (టక్నికల్) కే రమేష్, మెంబర్ ఫైనాన్స్ యన్ దేవేందర్, ఇండిపెండెట్ మెంబర్ ఎం రామారావు, భద్రాద్రి కొత్తగూడెం విద్యుత్ శాఖ ఎస్ఈ జీ మహేందర్, డీఈ రంగాస్వామీ, ఏడీ హేమంచంద్ర, ఏఈ టేకులపల్లి హట్కర్ దేవా, బొమ్మనపల్లి ఏఈ బుజ్జి కన్నయ్య, ఏఈ లక్ష్మీదేవిపల్లి, రఘురామయ్య టేకులపల్లి, బొమ్మనపల్లి, లక్షి దేవిపల్లి విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ ఈవోపై ఆక్రమణదారుల దాడిని ఖండించిన ఉద్యోగ సంఘాలు

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



**భద్రాచలం, జూలై 9,ప్రజాజ్యోతి :** భద్రాద్రి రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్న క్రమంలో వాటిని అడ్డుకునేందుకు వెళ్లిన భద్రాచలం ఆలయ ఈవో రమాదేవిపై ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన ఆక్రమణదారులు భౌతిక దాడులు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం టీఎన్జవోస్, భద్రాద్రి దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం, విశ్రాంత ఉద్యోగుల సంఘం, వివిధ దేవస్థానాల వైదిక పరిపాలనా సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో తానీషా కల్యాణమండం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆలయ భూములు పరిరక్షించడానికి వెళ్లిన దేవస్థానం సిబ్బందితో అభ్యంతరకరంగా మాట్లాడటమే కాకుండా దాడిచేయడాన్ని తీవ్రంగా నిరసించారు. బాధ్యులపై ఏపీ ప్రభుత్వం, పోలీసు అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, భద్రాద్రి రామయ్య భూముల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామయ్య భూముల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు, సిబ్బందికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ డివిజన్ అధ్యక్షులు డెక్కా నర్సింహారావు, కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ, దేవస్థానం ఏఈవో భవానీ రామకృష్ణ, ఇంజనీరింగ్ విభాగం ఈఈ రవీంద్రనాథ్, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది, పలు ఉద్యోగసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## సమ్మె విజయవంతం

- సమరశీల పోరాటాలే శరణ్యం




**టేకులపల్లి,జూలై09,ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక ఉద్యోగ రైతాంగ సంఘాలు ఇచ్చిన సమ్మె బుధవారం టేకులపల్లి మండలంలో విజయవంతంగా నిర్వహించామని జేఏసి నాయకులు తెలిపారు. ఈసమ్మె సందర్భంగా టేకులపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయం నుండి బోడు రోడ్డు సెంటర్ వరకు జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించారు. ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి .ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ తీసుకువచ్చిన నాలుగు కోడ్ లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతాంగం తమ రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించి చట్టాలను వెనక్కి కొట్ట గలిగారని అదే స్ఫూర్తితో కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా కార్మిక వ్యతిరేక నాలుగు కోడులను వెనక్కి కొట్టగలమని ఆశాభావం వ్యక్తం చేశారు దేశంలో కార్మిక వర్గం సంగటితం కావలసిన అవశ్యకతను గుర్తు చేశారు. ఈరోజు దేశవ్యాప్త సమ్మెలో సుమారు 25 కోట్ల మంది సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం సమ్మెలో పాల్గొన్నారని వారు అన్నారు టేకులపల్లి మండలంలో ఓబి ,అంగన్వాడి, ఆశ,హమాలి, భవన నిర్మాణం, గ్రామ పంచాయతీ తదితర అసంఘటిత సంఘటిత కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హర్జ్యా, గుగులోతు రామచంద్ , ఐఎఫ్టియు నెల్లూరి నాగేశ్వరరావు, సిఐటియు వజ్జ సురేష్, ఐఎఫ్టియు గ్రామపంచాయతీ మండల అధ్యక్ష కార్యదర్శులు మూడు బిచ్చు ,ఈసం మహేష్, ఏఐటీయూసీ నాయకులు అయితా శ్రీరాములు, ,రాయల ఇందిరా, గుగులోతు శ్రీను,ఏజ్జు భాస్కర్, సిఐటియు నాయకులు కడుదుల వీరన్న, శకుంతల, సిపిఎం నాయకులు ఈసం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.